నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | జనవరి 13, 2024 | www.navatelangana.com

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రంగుల పోటీ



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతిని పురస్కరించుకొని ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు కళాశాల ఆవరణ, రంగురంగులతో చూడ ముచ్చటగా ముగ్గులు వేశారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతగా పుల్కల్ జట్టు




నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని దడ్గి చౌరస్తాలో నిర్వహించిన గణేష్ గుప్తా స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పుల్కల్ జట్టు ఫైనల్ విజేతగా నిలిచింది. గత వారం రోజుల నుంచి జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 క్రికెట్ జట్లు తలపడగా ఫైనల్ మ్యాచ్‌లో పుల్కల్, బిచ్కుంద జట్లు ఆడాయి. రసవత్తరంగా సాగిన ఫైనల్ మ్యాచ్లో పుల్కల్ జట్టు భారీ స్కోరు సాధించి విజయంతో కప్పు సొంతం చేసుకుంది. పుల్కల్ జట్టుకు టోర్నమెంట్ నిర్వాహకులు కప్పు ప్రైజ్‌మనీ అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు రాహుల్ గుప్తా, సంతోష్ గుప్తా, క్రికెట్ అభిమానులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమతుల పేరిట ఇసుక డంపులు

- రాత్రి సమయంలో లారీల ద్వారా ఇసుక రవాణా
- అధికారులు మారిన ఆగని ఇసుక దందా
- ఒకే పర్మిట్‌పై రెండు రోజుల పర్మిషన్
- లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి



గోపన్‌పల్లి గ్రామ శివారులో ఇసుకడంపు..



పుల్కల్ గ్రామ శివారులో ఇసుకడంపులు..



రెండు రోజుల కోసం ఒకే ఇసుక పర్మిట్ జారీచేసిన అధికారులు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతం నుంచి అనుమతుల పేరుతో అధికారులు అక్రమ ఇసుక రవాణాదారుల కుమ్మక్కుతో అనుమతుల పేరుతో గ్రామ శివారులో డంపులు వేసి రాత్రి సమయాల్లో లారీల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. శుక్రవారం బిచ్కుంద మండలంలోని పుల్కల్ మంజీర పరివాహక ప్రాంతం నుంచి రెవెన్యూ అధికారులు ట్రాక్టర్ల ద్వారా జుక్కల్ మండలంలోని దోస్పల్లి, డోన్‌గావ్ రోడ్డు పేరిట పర్మిట్లు జారీచేసి ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారు.

ఉదయం 8 గంటల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తూ కొందరు పుల్కల్ గ్రామ శివారులో గోపన్‌పల్లి గ్రామ శివారులలో ఇసుక డంపులు వేసి రాత్రి సమయంలో యథేచ్ఛగా లారీల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో అక్రమ ఇసుక రవాణాదారులు అధికారులతో కుమ్మక్కై లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

ఒకే పర్మిట్‌పై రెండు రోజుల అనుమతులు..

ప్రభుత్వ పనులకు ఇంటి నిర్మాణాలకు ఇసుక అవసరం ఉన్నవారు ప్రభుత్వానికి ఒక ట్రాక్టర్‌కు 660 సీనరీస్ చార్జెస్ చెల్లించి రెవెన్యూ అధికారుల వద్ద అనుమతులు తీసుకొని పర్మిట్ పొంది పర్మిట్‌పై బయలుదేరిన సమయం ఆ రోజు తేదీ, చేరాల్సిన గమ్యం, సమయం రాయాల్సి ఉంటుంది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేయాల్సి ఉండగా దీనికి విరుద్ధంగా అధికారులు ఇసుక ట్రాక్టర్ యజమానుల కుమ్మక్కుతో ఒక పర్మిట్ మాత్రమే జారీ చేసి ట్రాక్టర్ నెంబర్ వేసి రెండు రోజుల తేదీలు వేసి రాత్రి సమయంలో కూడా ఇసుక రవాణా చేసుకునే విధంగా సాయంత్రం 6 : 30 నిమిషాలు రాసి ఒక పర్మిట్‌పై ఐదు నుండి ఆరు ట్రిప్పులు ఇసుక రవాణా చేసి ప్రభుత్వ ఆదాయానికి రోజుకు 60వేల నుంచి లక్ష రూపాయల వరకు గండి కొడుతున్నారు. ఈ తతంగం మొత్తం రెవెన్యూ అధికారుల కనుసన్నుల్లో జరగడం గమనార్హం.

అధికారులు మారినా మారని తీరు..

మండలంలోని గ్రామ శివారులో అక్రమ ఇసుక డంపులు రాత్రి సమయాల్లో లారీల ద్వారా ఇసుక రవాణా తదితర కథనాలు గతంలో దినపత్రికల్లో రావడంతో దినపత్రికల కటింగ్‌లతో స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులను బదిలీ చేశారు. కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారులు అక్రమ ఇసుక రావాణాకు సహకరిస్తుండటం ప్రజలు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని బిచ్కుంద తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ వెనుతిరిగారు.

కలెక్టరేట్‌లో సంక్రాంతి సంబురాలు



బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఎంప్లాయ్ జేఏసి జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ అధ్యక్షతన కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ శాఖల మహిళా ఉద్యోగులు ఔత్సాహికులు పోటీల్లో పాల్గొని తమ తమ ప్రతిభ ఆధారంగా రకరకాల రంగవల్లికలను నిర్ణీత సమయంలో వేయగా.. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అడిషనల్ కలెక్టర్ పి.యాదిరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రకాంత్, హాజరై ప్రతి పోటీదారుల వద్దకు వెళ్లి రంగవల్లికలను వీక్షించి అభినందించి, మొదటి బహు మతిగా సాయిప్రసన్న, నీటిపారుదల శాఖ, రెండవ బహుమతి ఎస్.వినోద, జిల్లా పౌరసరఫరాల శాఖ, మూడవ బహుమతి టి.వినీత, పశువైద్యశాఖ, కన్సోలేషన్ బహుమతులు ఎస్.సుజాత డీఆర్‌డీఏ, సౌమ్య, మాత, శిశు సంక్షేమశాఖ గెలుపొందగా.. పోటీదారులకు ముఖ్య అతిథులు పి.యాదిరెడ్డి బహుమతుల ప్రదానం చేశారు. ప్రతి ఒక్కరినీ అభినందించి సంక్రాంతి పండుగ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ మాట్లాడుతూ.. టీఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందనతో మహిళ ఉద్యోగ సోదరీమణులు హాజరై, క్రమశిక్షణతో రంగవల్లికలు వేసిన తీరుకు మంత్ర ముగ్ధులమయ్యామని, ప్రతి సంవత్సరం టీఎన్జీవో ఆధ్వర్యంలో ఈ ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, ఎం.సతీష్‌కుమార్, టీఎన్జీవో జిల్లా మహిళా కార్యవర్గ సభ్యులు, కె.పి.సునీత, వసుమతి దేవి, మంజుల, ఇందిరా, విజయలక్ష్మి, సంధ్యరాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, సంజీవయ్య, సత్యం, దినేష్‌బాబు, మహేందర్, ఉమాకిరణ్, సతీష్, ప్రవీణ్, మహిళా ఉద్యోగ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగినులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించిన ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (40) సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో కామారెడ్డి నుంచి దోమకొండ గ్రామానికి వెళ్తున్న ద్విచక్ర వాహనం సైకిల్‌ను ఢీకొనగా సైకిల్‌పై ఉన్న వెంకటేష్, ద్విచక్ర వాహనంపై ఉన్న నిఖిల్ (29) అక్కడికక్కడే మరణించారు. వాహనం వెనకాల ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి

హిట్ అండ్ రన్ జీఓ కొట్టివేయాలి

- లారీ డ్రైవర్ల నిరసన



నిరసన చేపడుతున్న లారీ డ్రైవర్లు

నవతెలంగాణ-బోధన్

కేంద్ర ప్రభుత్వం డ్రైవర్స్‌లపై నూతనంగా తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ జీఓ రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం బోధన్ పట్టణంలోని బాబా గార్డెన్ సమీపంలో లారీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై తీసుకొచ్చిన జీవో వలన తీరని నష్టం కలిగే అవకాశం ఉందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లారీ డ్రైవర్లకు 10 సంవత్సరాలు జైలు శిక్ష ఏడులక్షల జరిమానా విధించడం ఆ డ్రైవర్ నిరుపేద కుటుంబానికి తీరని వేదన అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రవాణా శాఖ మంత్రి నితీన్ గడ్కరీ దీనిపై ఈ జీఓ రద్దు చేసేలా తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆ జీఓను తొలగించే వరకు శాంతియుతంగా వాహనాలు గేర్ డౌన్ చేసి నిరాహార దీక్షలకు కూర్చుంటామని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో నాయకులు షేక్ అహ్మద్, సలీం ఛావూస్, షేక్ నాషీద్ పాషా, షేక్ బాబు, షేక్ ఖాజా, మహమ్మద్ సాజిద్ ఖాన్, అబ్దుల్ ఖాదీర్, సయ్యద్ ఫరూక్ అలీ పాల్గొన్నారు.

ఏటీఎంలోకి వెళ్లి వచ్చేలోగా బైక్ చోరీ

నవతెలంగాణ-భిక్కనూర్

ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసుకొని బయటికి వచ్చేలోగా ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంతంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి పట్టణ కేంద్రంలో ఉన్న ఏటీఎం సెంటర్‌లోకి వెళ్లి డబ్బులు డ్రా చేసుకొని వచ్చేలోగా ఏటీఎం బయట ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించక స్థానికుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స.హ.చట్టం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ రోజా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స.హ.చట్టం 2005పై సమాచార హక్కు చట్టం సభ్యులు ప్రజలకు వివరించడం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సంకి రతన్‌కుమార్, జిల్లా ఆర్గనైజర్ చిన్నస్వామి, మండలాధ్యక్షులు రమేష్, సభ్యులు మోహన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని దర్శించుకున్న ఎస్బీఐ జనరల్ మేనేజర్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయాన్ని హైదరాబాద్ ఎస్బీఐ జనరల్ మేనేజర్ మంజు శర్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీధర్ శాలువాతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామగిరి శర్మ, రాజేశ్వర శర్మ సిద్ధేశ్వర్ పంతులు, కామారెడ్డి ఏజీఎం, భిక్కనూర్ ఎస్బీఐ మేనేజర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తూకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు

నవతెలంగాణ-కామారెడ్డి

తూకంలో అవకతవకలకు పాల్పడినా.. సమయ వేళలు సరిగ్గా పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు చౌకధరల దుకాణ డీలర్లను హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని పలు చౌకధరల దుకాణాలను తమ బృందంతో కలిసి ఆకస్మికంగా తనఖీ చేశారు. కొన్ని చోట్ల తూకం సరిగ్గా వేస్తుండగా.. మరికొన్ని చోట్ల గోనె సంచులతో తూకం వేస్తుండటాన్ని గమనించారు. తద్వారా లబ్ధిదారుడు ఆ సంచి బరువు (సుమారు 600 గ్రాముల) బియ్యం కోల్పోతున్నారని గుర్తించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మిషన్‌పై గోనె సంచితో బియ్యం తూకం చేస్తున్న ఒక చౌక ధరల దుకాణాన్ని, సమయవేళలు పాటించని మరో దుకాణాన్ని గుర్తించి శాఖాపరంగా కేసు నమోదు చేసి తగు చర్యల కోసం, పెనాల్టీ విధించేందుకు ఆర్.డి.ఓ.కు తగు నివేదిక పంపామని మల్లికార్జున్ బాబు తెలిపారు. చౌక ధరల దుకాణాలను ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తెరిచి ఉంచాలని, తూకంలో ఎలాంటి తేడా రాకుండా చూడాలని కోరారు. జిల్లాలోని చౌకధరల దుకాణాలను తరచూ ఆకస్మికంగా తనిఖీ చేస్తుంటామని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్ఓ హెచ్చరించారు. ఈ తనిఖీలో సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

దుబాయ్‌లో బోనాల్ వాసి మృతి

- మృతిపై పలు అనుమానాలు
- కుటుంబంలో విషాదఛాయలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన యువకుడు దుబాయ్‌లో మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాధ చాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన గరిగే ప్రభాకర్ (28) బతుకుదెవరు కోసం 8 నెలల క్రితం కంపెనీ వీసాపై ఏజెంట్ సహకారంతో దుబాయ్ వెళ్లారు. ఎనిమిది నెలల క్రితం దుబాయ్ దేశంలో దిగి ఒకరోజు వారికి కేటాయించిన రూంలో ఉన్నారు. మరుసటి రోజు నుండి పని కోసం వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం దుబాయ్ దేశంలోని మిత్రులతోపాటు ఇతరులు అంతటా వెతికారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఎంతకూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో సదరు ఏజెంట్‌ను కుటుంబ సభ్యులు అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో 8 నెలలుగా కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా.. గత వారం రోజుల క్రితం ఎడారిలో శవం లభ్యం కావడంతో దుబాయ్ దేశానికి చెందిన వారు కొందరు బోనాల్ గ్రామస్తులకు సమాచారం అందించారు.



ప్రభాకర్ మృతిచెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కాగా శుక్రవారం రాత్రి స్వగ్రామానికి మృతదేహం రానున్నట్టు గ్రామస్తులు తెలిపారు. అప్పులు తీరుస్తానని దుబాయ్ వెళ్లి కానరాని లోకానికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంతో వారి కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. కాగా.. మృతుని తండ్రి పర్వయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి భార్య రాధ, పిల్లలు, తల్లి శాంతమ్మ ఉంది.

అర్హులైన అందరికీ అభయహస్తం పథకాలు అందించాలి




మాట్లాడుతున్న యాదాగౌడ్

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రజా పాలనలో ఇచ్చిన హామీలను అర్హులందరికీ అభయహస్తం పథకంలో అందించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు యాదాగౌడ్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బోధన్ ప్రాంతంలో సంస్థాగతంగా బలపడటంతో పాటు పార్టీ తరపున రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఇటీవల ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సభ్యులకు, స్థానిక శాసనసభ్యులు సుదర్శన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ తీర్మానం ఆమోదించారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ ఇంచార్జ్ గోపాల్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సిహెచ్‌వి హనుమంతరావు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు సచిన్ పటేల్, బోధన్ పట్టణ అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకుడు



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన సంకరి ప్రేమ్‌కుమార్ తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ప్రేమ్‌కుమార్ ఉదయం తమ పంట పొలానికి వెలుతుండగా పర్సు రోడ్డుపై దొరికింది. ఆయన వెంటనే అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ వాట్సాప్ గ్రూపులో ఈ విషయం వెల్లడించడంతో అదే గ్రామానికి చెందిన రత్నాకర్ అనే వ్యక్తిదని తెలియగానే ఆయనకు వెంటనే అందజేశాడు.

పాడి రైతుల డబ్బులు చెల్లించండి

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని విజయ పాల డెయిరీ రైతులకు ఒక నెల 15 రోజుల నుంచి పాడి డబ్బులు చెల్లించడం లేదని శుక్రవారం పాడి రైతులు ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ వస్తున్న యజమాన్యం పాల డబ్బులు చెల్లించకపోవడంతో, పండగకు రైతులం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నేటి నుంచి బ్యాంకులకు కూడా సెలవు ఇవ్వటంతో, రైతులకు పండగకు డబ్బులు అందకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యజమాన్యం వెంటనే ఒక నెల 15 రోజుల పాడి డబ్బులు వెంటనే చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

- సిపిఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్



మాట్లాడుతున్న మోతీరాం నాయక్

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్ డిమాండ్ చేశారు. గాంధారి మండల కేంద్రంలో గాంధారి మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతీరాం నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వందరోజుల్లో అమలు చేయాలని, లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని అన్నారు. పేద ప్రజలకు ఇల్లు లేక కిరాయి ఇండ్లల్లో ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీసం ఈ ప్రభుత్వమైనా వంద గజాల భూమి చూయించి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తే పేద ప్రజలకు సాయం చేసిన వాళ్ళు అవుతారని చెప్పారు. అలాగే పెన్షన్ లేని వారికి వెంటనే పెన్షన్లు అమలు చేయాలని, నిరుపేదలకు రెండెకరాల భూమి చూపించాలని అన్నారు. పలు కాలనీల్లో మంచినీటి సమస్య ఉందని, ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గాంధారి మండల కేంద్రంలో వారం అంగడి రోడ్డుమీద నిర్వహిస్తుండగా చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నారని చెప్పారు. గుడికుంట జాగాను అంగడి మార్కెట్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి కమ్మర్ సాయిలు అధ్యక్షత వహించగా.. సభ్యులు కామెడీ రాములు, మధు, కిషన్‌రావు, పటేల్ జమున, శ్రీలత పాల్గొన్నారు.


లోన్ చెల్లించకపోవడంతో ఇల్లు జప్తు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలో కెనరా బ్యాంకు నుంచి పట్టణానికి చెందిన ఓ మహిళ రూ.12 లక్షల తన సొంత ఇంటిని మార్గజ్ ద్వారా లోన్ తీసుకోగా లోన్ డబ్బులు, వడ్డీ కట్టని పక్షంలో బ్యాంక్ అధికారులు శుక్రవారం ఇంటిని జప్తు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ లోన్ డబ్బులు కట్టాలని ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసిన సమాధానం లేని పక్షంలో ఇంటిలో ఉన్న మహిళను ఇంటి నుంచి ఖాళీ చేసి ఆన్‌లైన్‌లో విక్రయించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, ఏఎస్ఐ జగదీష్, రీజినల్ అధికారి చంద్రభూషణ్, బ్యాంక్ సిబ్బంది భార్గవ్, సుధీర్, ఈశ్వర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ మెంబర్ షిప్ తీసుకోండి

- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మెన్ డి.ఉమాకాంత్



నవతెలంగాణ-జుక్కల్

రెడ్‌క్రాస్ సొసైటీలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ మెంబర్ షిప్ తీసుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మెన్ డి.ఉమాకాంత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చైర్మెన్ డొంగ్లే ఉమాకాంత్, జిల్లా కోశాధికారి దస్త్రీరాం చేతుల మీదుగా రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ షిప్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల యువకులు, పెద్దలు స్వచ్ఛంద సంస్థ సేవలో తమవంతు కూడా సహయ సహకారాలు అందిస్తామని అన్నారు. సేవ చేసేందుకు ఇష్టం కలిగి ఉన్న వారు రూ.1150 చెల్లించి లైఫ్ టైం అచీవ్‌మెంట్ మెంబర్ షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సభ్యులు సొసైటీ అభివృద్ధికి తమవంతుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు అవినాష్ పటేల్, రమేష్ వాసరే, బసవరాజ్ పటేల్, శివాజీ, తుకారం, భీంరావ్, శ్రీనివాస్, బండు తదితరులు పాల్గొన్నారు.

పిప్రి సొసైటీలో కొత్త రుణాలు అందజేత


రుణాలను అందజేస్తున్న చైర్మన్

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని పిప్రి సహకార సంఘంలో 17మంది సభ్యులకు 14,85,000 మాఫీ అయిన రుణాలు, స్వల్ప కాలిక కొత్త రుణాలను శుక్రవారం అందజేసినట్టు సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల సహకారంతో, సొసైటీ కార్యదర్శి, సిబ్బంది కృషితో అభివృద్ధి పథలో పయనిస్తుందని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తూ అందుబాటులో ఎరువులు, విత్తనాలు ఉంచుతున్నామని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హన్మాండ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఆమోదించండి

- డీసీవోకు డైరెక్టర్ల వినతి


వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

నవతెలంగాణ-సిరికొండ
మండలంలోని సిరికొండ సొసైటీ చైర్మన్ మైలారం గంగారెడ్డిపై అవిశ్వాస తీర్మానం ఆమోదించాలని శుక్రవారం సొసైటీ డైరెక్టర్లు డిసిఓ సింహాచలంను నిజామాబాద్‌లోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సొసైటీ పరిధిలో 13 మంది డైరెక్టర్లు ఉండగా, 09 మంది సొసైటీ డైరెక్టర్లు కలిసి తీర్మాన పత్రాన్ని అందజేశారు. కొత్త చైర్మన్ ఎన్నికకు వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. చైర్మన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్లు డైరెక్టర్లు తెలిపారు.

బషీరాబాద్‌లో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని బషీరా బాద్ గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవా రం ప్రారంభమైంది. స్థానిక బషీరాబాద్ క్రికెట్ అసోసియే షన్ మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ సక్కరం అశోక్, ఎంపీటీసీ తోట జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్నేహపూరిత వాతావరణంలో టోర్నమెంట్ జరిగేలా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రీడల ద్వారా యువతకు ఎన్నో రకాల లాభాలున్నాయని, క్రీడల్లో రాణించడం ద్వారా జీవితంలో కూడా స్థిరపడవచ్చు అని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించడం ద్వారా యువత జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకుని నిలబడే ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు. కాగా ఈ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లాలోని వివిధ మండలాల నుండి 24 జట్లు పాల్గొంటున్నట్లు బషీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు బందెల రాజు తెలిపారు. టోర్నమెంట్ ప్రారంభంగా జరిగిన తొలి మ్యాచ్ లో కమ్మర్‌పల్లి, భీంగల్ జట్లు తలపడగా కమ్మర్ పల్లి జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాజన్న, రంజిత్, గౌరవ సభ్యులు సంజీవ్ గౌడ్, బి.నగేష్, శ్రీనివాస్, దేవేందర్, రాజేష్, నాయకులు నారాయణ, నెల్ల రమేష్, వినోద్, అరవింద్, చైతన్య , పండు, తదతరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-సిరికొండ
విద్యార్థులు చదువులోనే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ముందుం డాలని ఎంపీడీఓ లక్ష్మి ప్రసాద్ అన్నారు. సిరికొండ మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూ ల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు విద్యార్థులు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. పోటీలో వేసిన ముగ్గులను మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి ఆధ్వర్యంలో పరిశీలించి అందంగా వేసిన ముగ్గులను ఎంపిక చేశారు. ఎంపీడీవో లక్ష్మీ ప్రసాద్ బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థినిలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి ప్రసాద్, ప్రతిభ హై స్కూల్ ఎండి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ హరీష్, మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి, హెచ్ఎం అశోక్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని హాస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1998-1999 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరూ ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులైన ప్రతాప్ రెడ్డి, రుక్మయ్య లక్ష్మీ నరసయ్యను పూర్వ విద్యార్థులు శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు అందరూ కలిసి ఒకే వేదికపై చాలా సంవత్సరాల తర్వాత కలుసుకోవడం పట్ల ఆనందం వెలిబుచ్చారు. చిన్ననాటి స్నేహితుల యోగక్షేమాలను, వారి వారి వివరాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అంతా కలిసి ఒక చోట చేరి ముచ్చటించుకున్నారు. అనంతరం గ్రూప్ ఫోటో దిగి, సహపంక్తి భోజనాలు చేశారు.

మండల పాస్టర్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు


పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భీంగల్
మండల పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని ది లివింగ్ గాడ్ చర్చ్‌లో రెవరెండ్ డాక్టర్ జి. ప్రేమ్ కుమార్ అధ్యక్షతన జరిగిన మండల పాస్టర్ అసోసియేషన్ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా రిక్క దేవదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మాణిక్యాల ఏలియా, ప్రధాన కార్యదర్శిగా బోయిడి సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా పి .జీవరత్నం, కోశాధికారిగా మోహన్, సలహాదారులుగా డి.సామ్యేల్, సిహెచ్ ఇజ్రాయిల్, డేవిడ్ రాజ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గ ఎన్నికల పరిశీలకులుగా క్రిస్టియన్ డెవలప్‌మెంట్ ఫోరం బాల్కొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సిహెచ్.ఇజ్రాయిల్, డి సామ్యూల్, జి. ప్రేమ్‌కుమార్, చెంగల్ దేవిడ్ రాజులు వ్యవహరించారు. కార్యక్రమంలో దైవజనులు టి. సామ్యూల్, జేమ్స్, నెల్సన్, ఇమ్మానుయేల్, ఫిలోమెన్ డానియల్ నోవా, లాజర్, పాల్ డేవిడ్, విజయ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత పాలకవర్గం, అధ్యక్షుడు జి ప్రేమ్ కుమార్ సేవలను కొనియాడారు.

చట్టాన్ని చేతిలోకి తీసుకునే హక్కు వీడీసీలకు లేదు

- నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్
చట్టాన్ని చేతిలోకి తీసుకునే హక్కు వీడీసీలకు లేదని నిజామాబాద్ ఏసీ పి కిరణ్ కుమార్ అన్నారు. పట్టణ మార్కెట్ యార్డులో శుక్రవారం దే గాం వీడీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ పి మాట్లాడుతూ వీడీసి అంటే గ్రామ అభివృద్ధిలో భాగస్వామం అని, వ్యక్తిని నిర్బంధించి శిక్ష అమలు చేసే పని చేయవద్దని, జరిమానాలు వేయడం అంటే శిక్ష అమలు చేయడమేనని అన్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అసలు జరిగింది ఏమిటంటే..
ఆలూర్ మండలం దేగాం గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) అదుపులో రైతుల పంట పొలాల విద్యుత్ మోటార్ల కరెంట్ బాక్స్‌ల స్టార్టర్ల దొంగలు ఉన్నట్లు తెలుసుకున్నారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా రైతుల పంట పొలాల్లోని విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు, స్టార్టర్లు, విద్యుత్ సామాగ్రి దొంగతనం జరిగింది. దీంతో రైతులు నిఘా ఉంచి రెండు మూడు రోజుల కిందట కేబుల్ వైర్లు, స్టార్టర్లు, విద్యుత్ సామాగ్రి దొంగతనం చేస్తున్న ఒక వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పొలాలలో విద్యుత్ సామాగ్రి స్టార్టర్లను దొంగతనం చేస్తున్న దొంగను పట్టుకొని గ్రామస్తులు వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి దొంగతనం చేస్తూ పట్టుబడ్డ వ్యక్తిని పోలీసులకు


మాట్లాడుతున్న ఏసిపి కిరణ్ కుమార్

అప్పగించాల్సి ఉండగా గ్రామస్తులు అదుపులో తీసుకొని తమదైన పద్ధతిలో విచారణ చేసి ఎక్కడెక్కడ ఎవరెవరి పొలాల్లో విద్యుత్ సామాగ్రిని దొంగతనం చేశారనే విషయాలను తెలుసుకున్నారు. ఈ విషయం చిలికిచిలికి బయటకి పొక్కడంతో సిపి కల్మేశ్వర్ ఆదేశానుసారం విడిసి అదుపులో ఉన్న దొంగను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్కు తీసుకొచ్చారు.

కొద్దిసేపు వాగ్వివాదం..
పోలీసులకు వీడీసీ సభ్యులకు మధ్య కొద్దిసేపు తీవ్ర వాగ్వివాదం జరిగింది. సామరస్య పూర్వకంగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఏసిపి సూచించడంతో సద్దుమనిగింది. కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది దేగాం గ్రామ మాజీ సర్పంచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

- బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్
మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆ లోపు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్‌టి యు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు చెప్పి సంవత్సరాలు గడిచినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం వాటి కార్మికవర్గ వ్యతిరేక దోపిడి స్వభావాన్ని తెలియజేస్తుందని


మాట్లాడుతున్న నాయకులు

విమర్శించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వాహనాలకు వాడే డీజిల్ కొందరు అధికారులు లబ్ది పొందేందుకు ఒకటి రెండు పెట్రోల్ బంక్ ల్లోనే డీజిల్ కొంటున్నారని ఆరోపించారు. నగరంలో నాలుగు ప్రాంతాల నుండి టెండర్ ప్రక్రియ ద్వారా పెట్రోల్ బంక్‌లను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

వాహనాల రిపేర్ లలో అధిక బిల్లుల ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థిక నష్టం చేస్తున్నారని డీజిల్, వాహనాల రిపేర్‌లపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారి నుండి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎల్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నగర అధ్యక్షులు కె.రాహుల్, కార్యదర్శి గంగ శంకర్, డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షులు , మోహన్ గౌడ్ నాయకులు హరీష్, జి.యాదయ్య, సహదేవ్, మురళి, రిజ్వాన్ వసంత్, శ్రీశైలం, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానం 2020 రద్దు చేయాలి


మాట్లాడుతున్న రాజుగౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్
జాతీయ విద్యా విధానం-2020 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 16 విద్యార్థి సంఘాలు ఇచ్చిన చలో పార్లమెంట్ పిలుపులో భాగంగా న్యూఢిల్లీ, జంతర్ మంతర్లో జరుగుతున్న కార్యక్రమంలో ఏఐఎస్బి జాతీయ ఉపాధ్యక్షులు గొల్లపల్లి రాజుగౌడ్ మాట్లాడుతూ పదేళ్ల మోడీ పాలన జాతీయ విద్యా విధానాన్ని ధ్వంసం చేసిందని, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను విధ్వంసం చేస్తూ, ఆదాని, అంబానీ లాంటి ధనవంతులకు యూనివర్సిటీలను ప్రైవేటుపరం చేసే కుట్ర చేసిందని మండిపడ్డారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నేటి వరకు కనీసం లక్ష ఉద్యోగాలు కూడా కల్పించలేదని ధ్వజమెత్తారు. విద్యా వ్యవస్థలోకి సనాతన ధర్మం, మనుధర్మ శాస్త్రాన్ని చొప్పించి విద్యను కాషాయీకరణ చేసే కుట్ర మోడీ చేసిందని ఆయన అన్నారు. జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే జాతీయస్థాయిలో అఖిలపక్ష విద్యార్థి సంఘాలతో రాబోయే కాలంలో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు ఘన నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అలిశెట్టి ప్రభాకర్ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన అద్భుతమైన రచయిత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షులు ప్రేమ్ లాల్, కార్యదర్శి వేముల శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ నగరంలోని హమాల్‌వాడి ప్రాంతంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులను వేసి తమ నైపుణ్యాన్ని చాటారు. ముగ్గులను రవి పబ్లిక్ స్కూల్ ప్రొప్రైటర్ పి.సరళ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి.ఆనంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తదితరులు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు.


ముగ్గులను పరిశీలిస్తున్న నాయకులు

అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగ అంటేనే రైతులకు, పిల్లలకు, మహిళలకు చాలా ఇష్టమైన పండుగని అన్నారు. పిల్లలు పతంగులను ఎగురవేస్తూ తమ ఉత్సాహాన్ని కనబరుస్తారని మహిళలు రంగురంగుల ముగ్గులతో


బహుమతులు పంపిణీ చేస్తున్న సరళ, నాయకులు

తమ నైపుణ్యాన్ని చాటుతారని వారు అన్నారు. కాలనీవాసులం దరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం లో ఐద్వ జిల్లా అధ్యక్షురాలు అనిత, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్, గంగమ్మ, స్వరూప, విమలమ్మ, దేవి, నవనీత, రాజక్క, గౌతమి పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే


నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాల్కొండ
ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర చాలా కీలకమని ప్రజల సమస్యలను పత్రిక ద్వారా వెలుగులోకి తేవాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా నవ తెలంగాణ-2024 క్యాలెండర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెలికి తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బలమైన విప్లవోద్యమ నిర్మాణం కోసం కృషి చేద్దాం

నవతెలంగాణ-సిరికొండ
బలమైన విప్లవోద్యమ నిర్మాణం కోసం కృషి చేద్దామని రమేష్ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి పిలుపునిచ్చారు. మండలంలోని రావుట్ల గ్రామంలో శుక్రవారం పార్టీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం పార్టీ ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు బాబన్న అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ, సీపీఐ(ఎంఎల్)రివల్యూషనరీ ఇన్షియేటివ్ మూడు విప్లవ పార్టీలు రెండు సంవత్సరాలుగా ఐక్యత చర్చలు సాగిస్తూ విలీనం అవ్వాలని నిర్ణయం తీసుకున్నాయని తెలిపారు. ఈ విప్లవ స్ఫూర్తిని తీసుకొని పార్టీ కార్యకర్తలు అంత బలమైన ప్రజాఉద్యమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పునుకుంటామని తెలిపారు. బీజేపీ మతోన్మాం పెరిగి దేశప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి పూనుకునుకుంటుందని విప్లవ శక్తులు మతరాజకీయాకుట్రలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్, మండల నాయకులు బాబన్న, దామోదర్, మల్కి. లింబాద్రి, దువ్వూరి సాయరెడ్డి, రమేష్, కిషన్, సాయిలు, లక్కం నరేష్, మూత గంగాదాస్, పెద్దసాయిలు, పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో మంజూరైన పనులు కొనసాగించాలి

- కావాలంటే ఆ పనుల క్రెడిట్ మీరే తీసుకోండి
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాల్కొండ
బాల్కొండ మండలం నాగపూర్ గ్రామంలో 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంజూరైన పనులు రద్దు చేయకుండా అలాగే కొనసాగించాలని, వాటిని రద్దు చేయడం సరి కాదని అన్నారు. ఆ పనులన్నీ బీఆర్ఎస్ పార్టీ లెటర్ హెడ్ మీద మంజూరు చేసినవి కావని, ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ అప్రూవల్‌తో వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు తెలంగాణ ప్రభుత్వం తరపున బాల్కొండ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కొరకు అధికారికంగా మంజూరు చేసినవి అని అన్నారు. ప్రజలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కుల సంఘాల సభ్యులు మంజూరైన పనుల ప్రారంభంకోసం ఆశతో ఉన్నారని అన్నారు. కావాలంటే స్థానిక అధికార పార్టీ నాయకులు ఆ పనులు కొనసాగించేలా చూడాలని, ఆ పనుల క్రెడిట్ కూడా మీరే తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. గతంలో వివిధ శాఖల ద్వార మంజూరా తీసుకొచ్చిన ఎస్‌డిఎఫ్ ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను రద్దు చేయకుండా కొనసాగించాలని తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖల మంత్రులను కోరారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలతో ఉల్లాసం



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
నిజామాబాద్ నగరంలో కోటగల్లి ఎన్ఆర్‌భవన్ ఆఫీసులో పిఓడబ్ల్యూ, పీడీఎస్‌యు, పీవైఎల్ నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యు నిజామాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్య, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయి బాబా, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడారు. మానసిక ఉల్లాసానికి రోజువారి పనులతో సతమతమవుతున్న మహిళలకు, యువతకి క్రీడా పోటీల ద్వారా తమ ప్రగతిశీల ఆలోచనలతో, శారీరకంగా కూడా ఎదుగుతూ ఉంటారని అన్నారు. ఒక ఉల్లాస వాతావరణాన్ని, ప్రజలందరం సమానులే అనే భావాన్ని చాటడానికి ఇది ఒక మంచి వాతావరణం అని కొనియాడారు. నేటి యువత, ప్రజలు ఫోన్లకు ఆన్లైన్ లాంటి వాటికి ఆకర్షితులై ఉన్న తరుణంలో క్రీడల ద్వారా వాళ్లలో ఉన్న ప్రగతిశీల భావజాలాన్ని పెంపొందించే విధంగా ఉండటం ముందటికి వెళ్లడం జరుగుతుందని అన్నారు. క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు. పాల్గొన్న ప్రతిఒక్కరికి బహుమతులు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర అధ్యక్షులు ఎస్.కే. అషర్, పిఓడబ్లు. జిల్లా సహాయ కార్యదర్శి గౌరీ, జమున, బాలమణి, కృష్ణవేణి, నవ్య, సంధ్య, స్వరూప, పావని, లత, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆలూరు సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆర్మూర్
ఆలూర్ మండలంలోని ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో ఆలూర్ సంఘం క్యాలెండర్-2024 చైర్మన్ తంబూర్ శ్రీనివాస్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సంఘం డైరెక్టర్లు కళ్ళెం భోజ రెడ్డి కళ్ళెం సాయ రెడ్డి, బార్ల సంతోష్ రెడ్డి, ఇంగు గోవర్ధన్, సింగెడి మల్లు బాయి, ప్రమోదు కుమార్, అరే రాజేశ్వర్, వెల్మ నర్స రెడ్డి, పచ్చుక లసుం బాయి, కట్ట నర్సయ్య, గొల్ల గంగాధర్, సంఘం కార్యదర్శి తొర్తి మల్లేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-ముప్కాల్
మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం విద్యాలయంలో శుక్రవారం సంక్రతాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానంలో విద్యార్థులకు రంగవల్లులు, పతంగుల పోటీలు



నిర్వహించారు. వివిధ రకాల వేషధారణలను ధరించి ఆటపాటలతో అలరించారు. అదేవిధంగా విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను వివరిం చారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు దయానంద్, పాఠశాల పూర్వ విద్యార్థులు దినేష్, రఘు, కమిటి సభ్యులు ఒడ్డెన్న, చంద్రమోహన్, గంగాధర్, రాజేందర్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-బాల్కొండ
సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా బాల్కొండ, కిసాన్ నగర్ గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బాల్కొండ విద్యుత్ శాఖ ఏఏఈ కే .శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు సహకరించాలని ఏఏఈ కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | జనవరి 13, 2024 | www.navatelangana.com

కోడి పందెం నిర్వహిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-రెంజల్

మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడిపందెం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఉదయకుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన అన్నారు. ఇటీవల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయని అమాయక ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారని వాటి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా చేసిన వారిపై ఇకనుంచి కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఉదయకుమార్ తెలిపారు. ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా కొప్పర్గ గ్రామం నుంచి నీలా వైపు వస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని విచారించగా వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు



బోధన్: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎడపల్లిలో...



దోమకొండలో...



సదాశివనగర్‌లో...

యువతకు ఆదర్శం.. వివేకానంద

- జయంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

యువతకు వివేకానంద స్వామి ఆదర్శమని పలువురు సూచించారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సూచించిన మార్గాలను యువత అనుసరించాలని చెప్పారు.

బోధన్: నేటి యువతకు స్వామి వివేకానందుడు ఆదర్శమని అయన ఆలయాల సాధనకు ప్రతి ఒకరు కృషి చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఇల్తెపు శంకర్ అన్నారు. సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. సమాజ మార్పులకు, అభివృద్ధికి యువకులు కూడా కీలకమని ప్రతి ఒకరు దుర్వ్యసనాలను వదిలి స్వామి వివేకానందుడు సూచించిన సన్మార్గాన్ని ఆచరించాలని సూచించారు. అలాగే ప్రతి ఒకరు విద్యావంతులుగా మారాలని విద్యతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్ల దత్తురాం, సొక్కం రవి, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు, సాలేన్ సంజీవ్, బోక్రే అశోక్, రాజు మహారాజ్, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను బోధన్ పట్టణంలో, మండలంలో ఘనంగా నిర్వహించారు .బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో, రాకాసిపేట్‌లో సాయి ఆదర్శ మహిళా మండలి ఆధ్వర్యంలో స్వామి వివేకనంద 161వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే బోధన్ మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్‌లో యువకులు విద్యార్థులకు స్వామి వివేకనంద జయంతి సందర్భంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం వారు వివేకానందుని బోధనలను, ఆశయాలను వివరించారు. నేటి కాలంలో ప్రతి యువత స్వామి వివేకనంద ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం స్వామి వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాయి ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు, లీగల్ సెల్ కోఆర్డినేటర్ పద్మ సింగ్, మదన్ సింగ్, నవ్య, లక్ష్మి, రణవీర్ సింగ్, ఖాజాబీ, కృష్ణ, అన్విత్, తనుష్, లోకేష్, నగేష్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి: ఎంపీపీ

ఎడపల్లి: నేటి యువతీ, యువకులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని ఎడపల్లి ఎంపీపీ కే.శ్రీనివాస్ అన్నారు. మంగళ్‌పహాడ్ చౌరస్తా వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, యువజన సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని ఆయా గ్రామాలలో స్వామి వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎడపల్లిలోని మంగళ్‌పహాడ్ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, సర్పంచ్ ఆకుల మాధవిచ వార్డు సభ్యులు సంధ్య, సదానందం, ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు అత్మెల శ్రీనివాస్, ఎడపల్లి ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు మల్లెపూల శ్రీనివాస్, శంకర చారి, ఎంఎస్పి జిల్లా కోఆర్డినేటర్ దల్ల సురేష్, మంగళ్‌పహాడ్‌లో సర్పంచ్ బట్టు హనుమాన్లు, ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, ఎంపీటీసీ అరుగుల వనజ నాగరాజు, రజక సంఘం ఎడపల్లి మండల అధ్యక్షులు దేగామ ముత్యం, గ్రామ పెద్దలు యువకులు నాయకులు పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి : జెడ్పీటీసి

దోమకొండ: యువత స్వామి వివేకానందున్ని ఆదర్శంగా తీసుకోవాలని జడ్పీటీసి తీగల తిరుమల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద జయంతి సందర్భంగా పలుగడ్డ ప్రాంతంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద చేసిన సేవలు మరిచిపోలేనివని, యువత సన్మార్గంలో నడుచుకొని మంచి భవిష్యత్తుతో ఉన్నతంగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు సీతారాం మధు, కదిరే గోపాల్‌రెడ్డి, బట్టి రాములు, సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, మర్కల్, సదాశివనగర్, వజ్జపల్లి తండా తదితర గ్రామాల్లో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరికొన్ని గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ వివేకానంద అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఓం క్లబ్ సభ్యులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలో పలు గ్రామాలతో పాటు రామారెడ్డిలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం..

రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని స్థానిక యువత రక్తదానం చేశారు. టీవీ విపి బ్లడ్ బ్యాంక్ బోధన్ ఆధ్వర్యంలో సుమారు 25 మంది యువత రక్తదానం చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శేషుగారి భూమారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు లింగన్న యాదవ్, కోశాధికారి నాగరాజ్, పోశెట్టి, మీకోసం మేము సేవా సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మయ్య, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు మహేష్, స్థానిక యువత అజయ్ యాదవ్, వెంకటేష్ గౌడ్, మహేష్, ప్రసాద్, సందీప్‌రెడ్డి, కారోబార్ కిరణ్‌రెడ్డి, నవ యువత సభ్యులు పాల్గొన్నారు. అలాగే దూపల్లి గ్రామంలో సర్పంచ్ శనిగరం సాయి రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు లింగన్న యాదవ్, నాగరాజ్, సొసైటీ చైర్మన్ శేష గారి బొమ్మ రెడ్డిలు స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాసరచన పోటీలతో పాటు, వాలీబాల్ వివిధ క్రీడలు నిర్వహించి వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొగులాబాయి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు లింగన్న యాదవ్, నాగరాజ్, పోశెట్టి, స్థానిక యువత పాల్గొన్నారు.

యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి

పిట్లం: యువత స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలని బిజెపి పార్టీ నాయకులు అశోక్ రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుని ఆశయాలతో యువత సమస్యలకు భయపడి పారిపోకుండా ఎదిరించి నిలబడి పోరాడాలని ఆయన సూచించారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత మూర్తి అని కొనియాడారు. అనంతరం ఉడుగుల రాములు గుప్తా వివేకానందుని వక్త ప్రవచనం నిర్వహించారు. కార్యక్రమంలో అంబదాస్, పవన్, వినయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్: మండలంలోని పలు గ్రామాల్లో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేమ్రాజ్‌కల్లాలీలో సర్పంచ్ రమేష్ దేశాయి, పెద్దఎడ్గిలో సర్పంచ్ అస్పత్‌వార్ వినోద్, జుక్కల్ కేంద్రంలో యువకులు, రాజకీయ నాయకులు పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు, యువ నాయకులు అస్పత్ వార్ అరుణ్, నగేష్, విఠల్, రాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డిలో...



రెంజల్‌లో...



పిట్లంలో...



జుక్కల్‌లో...

కామ్రేడ్ షావులం సాయిలు ఆశయాలను నెరవేరుస్తాం



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

కామ్రేడ్ శావులం సాయిలు ఆశయాలను నెరవేరుస్తామని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో చావులం సాయిలు 28వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిలు పేద కుటుంబంలో పుట్టి రైతు కూలీ సంఘంలో అంచలంచలుగా ఎదిగి జిల్లా కమిటీ సభ్యులుగా సిపిఐఎంఎల్, ప్రజాపంథా డివిజన్ నాయకులుగా ఎదిగి ఎడపల్లి, నవీపేట్, రెంజల్ మండలాల పరిధిలోని అనేక గ్రామాలు తిరుగుతూ రైతుకూలీ సంఘాలు ఏర్పాటు చేస్తూ ఉద్యమాలకు నాయకుడిగా ఎదిగారని వివరించారు. కార్యక్రమంలో శ్రీపతి మల్లేష్, కాషా రవి, సుదర్శన్ హనుమాన్లు, వైద్యనాథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట్‌లో బోరు మోటర్ ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో శుక్రవారం నూతన బోరు మోటర్ ప్రారంభించినట్లు జడ్పీటిసి మనోహర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయం ఆవరణలో నూతనంగా బోర్ వేశామని, దానికి సంబంధించిన బోర్ మోటర్ ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంట సొసైటీ డైరెక్టర్ వంశీగౌడ్, మాణిక్యం, సంతోష్, మాణిక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీని పరిశీలిస్తున్న సర్పంచ్ సాయిలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని జప్తి జాన్కంపల్లి గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం సర్పంచ్ దేశ బోయిన సాయిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో తరగతి గదులలో పై నుంచి పెచ్చులూడి పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని రోజుల క్రితం మరమ్మతులు చేయించినా లాభం లేకుండా పోయిందని శిథిలావస్థకు చేరడంతో కూలిపోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు.

చెట్టు పైనుంచి పడి యువకుడికి గాయాలు

- పలువురు ఆర్థికసాయం

నవతెలంగాణ-ఎడపల్లి

చెట్టు పైనుంచి పడి యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పోచారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన విట్టల్ అనే యువకుడు ప్రమాదవశత్తు చెట్టుపైనుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచ్ ఇంద్రకరణ్, యువకులు, విట్టల్ యువకునికి ఆర్థిక చేయూతనిచ్చారు. ఆస్పత్రి చికిత్స ఖర్చుల నిమిత్తం సరిపడా డబ్బులను పోగుచేసి గ్రామ యువకులు సర్పంచ్ సమక్షంలో బాధితునికి అందజేశారు.

జలాల్‌పూర్‌లో శ్రీరాముని అక్షింతల వితరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని జలా ల్పూర్ గ్రామంలో శుక్రవారం శ్రీరాముని అక్షింతలు వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రా మంలో తిరుగుతూ హిందూ ముస్లిం అని తేడా లేకుండా అందరికీ అక్షింతలు వితరణ చేసినట్లు గ్రామ సర్పంచ్ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.



విజయసాయి హైస్కూల్‌లో అలరించిన రంగవల్లులు



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని విజయసాయి హైస్కూల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులు పోటీపడుతూ ముగ్గులు వేశారు. దాంతో పాఠశాల ప్రాంగణం రంగులతో చూపరులను ఆకట్టుకుంది. సంక్రాంతి పండుగ విశిష్టతను తెలుపుతూ పండగ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. పండగలు ప్రకృతికి నిదర్శనమని, మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక వాటిని భవిష్యత్తు తరాలకు తెలియజేయవలసిన అవసరం అందరికీ ఉందన్నారు. కావున సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమా డాలియా, కౌన్సిలర్ అంకు సంధ్య దాము, పాఠశాల పిఆర్‌ఓ ఐఆర్ చక్రవర్తి, ప్రైమరీ పాఠశాల ఇంచార్జ్ ప్రసూన, ప్రైమరీ హెచ్.ఎం.కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలి

- జిల్లా అధికారికి కార్యవర్గ సభ్యుల నోటీసు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్ పనితీరుపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పదిమంది పాలకవర్గం సభ్యులు శుక్రవారం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారి సింహాచలంకు జిల్లా కేంద్రంలోని ఆ కార్యాలయంలో కలిసి అవిశ్వాస పత్రాన్ని అందజేశారు. శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ లింగారెడ్డి గారి సుకన్య అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండారు కృష్ణారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విశ్వాసం కోల్పోయారని, అందుకుగాను 13 మంది పాలకవర్గం సభ్యులకు గాను పదిమంది పాలకవర్గం సభ్యులు ముందుకు వచ్చి చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నిర్ణయించారు. ఈ అవిశ్వాస తీర్మానం పరిధించుటకు సంఘం కార్యవర్గం ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ సహకార సంఘం జిల్లా అధికారి సింహాచలంకు పదిమంది పాలకవర్గం సభ్యులు తమ సంతకాలతో కూడిన నోటీసు పత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి సకాలంలో స్పందించి త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని పాలకవర్గం సభ్యుల సమావేశం ఏర్పాటు చేయాలని వారు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సంఘం శెట్టిపల్లి సంగారెడ్డి సొసైటీ పరిధిలో 13 మంది పాలకవర్గ సభ్యులు ఉన్నారని, ఇందులో పదిమంది పాలకవర్గ సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టుటకు సిద్ధమయ్యారు. దీంతో జిల్లా ప్రాథమిక వ్యవసాయ శాఖ సంఘం జిల్లా అధికారి నోటీసును తీసుకున్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బాగేపల్లిలో చిన్నారులకు ముగ్గుల పోటీలు

- బహుమతులు అందజేసిన సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో సర్పంచ్ పాముల సాయిలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భర్త భూమేష్, ఉపసర్పంచ్ సుదర్శన్, నరేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులకు బహుమతులు అందజేత

దోమకొండలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి దోమకొండ రక్తదాతల సమూహం సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువతీ యువకులు పాల్గొని 20 మంది రక్తదాతలు శిబిరంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దోమకొండ సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఎం చల్లా సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, ఇతరుల ప్రాణ దాతలు అవ్వాలని కోరారు. కార్యక్రమంలో రక్తదాతల సమూహక నిర్వాహకులు శ్రీ బాలే సురేందర్, గాజులపల్లి గోపాల్‌రెడ్డి, మార్కండేయ పద్మశాలి సంఘం కార్యదర్శి బొమ్మెర గంగాధర్, ప్రతినిధులు కుందన వినోద్, చాట్ల అనిల్, సూరం రాము, అంద గణేష్, ఐసిటిసి కౌన్సిలర్ మేక నాగరాజు, బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ ప్రమోద్ పాల్గొన్నారు.

జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పిస్తున్నాం

- ఉపాధి హామీ ఎపిఓ శ్రీవాణి

నవతెలంగాణ-ఎడపల్లి

జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పిస్తున్నామని ఉపాధి హామీ ఎపిఓ శ్రీవాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కుర్నాపల్లి, తానాకలాన్, వడ్డేపల్లి, మంగళ్‌పహాడ్, దుబ్బతండాతో పాటు ఆయా గ్రామాలలో ఉపాధి పనులు కొనసాగుతున్నట్లు ఆమె వివరించారు.



కొనసాగుతున్న ఉపాధిహామీ పనులు

చైనా మాంజాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ వ్యాపార సంస్థలు సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలను ఎగురవేయడానికి చైనా మాంజాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై సాయి కుమార్ హెచ్చరించారు. చైనా మాంజాల ద్వారా వాహనాలపై, నడుచుకుంటూ వెళ్తున్న వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలకు కారణమయ్యే మాంజాలను విక్రయించరాదని సూచించారు.

రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం (బీ) విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 12 నుండి 14 వరకు సిద్దిపేట జిల్లా సాంఘిక సంక్షేమ పాఠశాల కొండపాక క్రీడా మైదానంలో జరుగుతున్న 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రణీత, స్వప్న, మేఘన ఉంటారని ప్రిన్సిపల్ సంగీత తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సంగీత మాట్లాడుతూ.. మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజా రెడ్డి, స్కూల్ పిఈటీ జోష్ణ, స్కూల్ సిబ్బంది అభినందించారు.

డిచ్‌పల్లిలో ముగ్గుల పోటీలు


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కు అనుకుని ఉన్న శ్రీ కాశీవిశ్వనాథ ఆలయంలో శుక్రవారం మహిళలకు, యువతులకు, పిల్లలకు డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తిరుమల ఏజెన్సీ ఆధ్వర్యంలో రంగోళి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు సంపత్ కుమార్, లక్ష్మన్, సునీల్ మాట్లాడుతూ.. ప్రతిఏటా డిచ్ పల్లి మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలైన గంగామణీ (ప్రథమ), సంధ్యారాణీ (ద్వితీయ), విదిషా(తృతియ)లకు నిర్వహకులు బహుమతులను అందించారు.


జక్రాన్‌పల్లి: వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసిన యూత్ సభ్యులు


నిజామాబాద్ సిటీలో...



ఆర్మూర్‌లో...

యువతకు స్ఫూర్తి ప్రదాత.. స్వామి వివేకానంద

- ఆయన ఆశయాలను కొనసాగించాలి
- ఘనంగా జయంతి వేడుకలు



జక్రాన్‌పల్లి: వివేకానంద విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు


ముప్కాల్‌లో...

నవతెలంగాణ-విలేకరులు

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఫర్‌ఫెక్ట్ యూత్ ఆధ్వర్యంలో వివేకానంద 161వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. యువతకు స్ఫూర్తి ప్రదాత భారతదేశంను ప్రపంచానికి చాటి చెప్పిన స్ఫూర్తి ప్రదాతకు పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లతా దేవరాజ్ ఎంపీటీసీ పోతే రాజు, ఎక్స్ సర్పంచ్ శేఖర్, యూత్ మెంబర్స్ పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ: స్వామి వివేకానంద ఆశయాలను యువత నెరవేర్చాలని అంబిక సత్యనారాయణ అన్నారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ అర్బన్ కన్వీనర్ అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని టిడిపి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

యువత రాజకీయంలో ఉండాలని, మానవసేవ చేయడానికి ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎండీ రఫీక్ ఖాన్, అనుబంధ సంఘ కన్వీనర్లు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరంలో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై నగరంలోని నాగారం, గాజులపేటలోని వివేకానంద విగ్రహాలకు అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ యువత వివేకానందని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క దేశం.. ప్రతి ఒక్క వ్యక్తి స్వామి వివేకానందుడిని ఎంతగానో గౌరవిస్తారని అన్నారు. అమెరికా వెళ్లి అక్కడి ప్రజలందరితో శభాష్ అనిపించుకున్నారని తెలిపారు. మన దేశంలో ఆధ్యాత్మిక విషయాలు, సనాతన ధర్మం గురించి విశ్వానికి ఎంతో చక్కగా వివరించారని అన్నారు. వివేకానందుడు యువతకు ప్రేరణనిచ్చే సూక్తులు ప్రతి ఒక్కరు చదవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లెందుల మమత ప్రభాకర్, పోతనకర్ లక్ష్మి నారాయణ, నాగోళ్ల లక్ష్మి నారాయణ, మల్లేష్ యాదవ్, పంచరెడ్డి శ్రీధర్, ఇప్పకాయల కిషోర్, పుట్ట వీరేందర్, గడ్డం రాజు, స్వామి యాదవ్, నారాయణ యాదవ్, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

ఆర్మూర్: రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పట్టణంలోని ఇంటర్ బాలుర కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నేటి సమాజంలో యువత పాత్ర అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. నేటి యువత వివేకానంద స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని , ఉన్నత స్థాయిలో నిలవాలని, దేశానికీ సేవలు అందించాలని కోరారు.. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ స్వర్ణ మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందు ఉండాలని, రోటరీ సేవలు స్ఫూర్తిదాయకం అని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారి తులసి కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ మాజీ అధ్యక్షులు పుష్కర్ రావు, ప్రవీణ్ పవార్, సభ్యులు ఆనంద్ ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: యువత జాతి నిర్మాతలుగా కావాలని యూఎఫ్ ఆర్‌ఐటి రాష్ట్ర కో కన్వీనర్ నరేష్ అంకం నరేష్ అన్నారు. హిందూ ధర్మ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను 1996-97 గోల్డ్ క్లాస్మేట్ బ్యాచ్ ఉన్నత పాఠశాల మండలం పడకల్ నందు ఘనంగా నిర్వహించారు.

బాల్కొండ: మండలంలోని కిసాన్ నగర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొల్పిన స్వామి వివేకానంద విగ్రహానికి శ్రీ సరస్వతి శిశు మందిర్ పూర్వ ప్రధాన ఆచార్యులు ఎంపాల సుదర్శన్, చైతన్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిజెపి నాయకులు తాళ్ల శ్రీనివాస్, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: స్వామి వివేకానంద జయంతి "జాతీయ యువజన దినోత్సవం" వేడుకలను మండల కేంద్రంలో డీసెంట్ పవర్ యూత్, యువజన సంఘం నాయకులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు స్వామి వివేకానంద జయంతి విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన జాతికి ఇచ్చిన సందేశాలను గుర్తుచేసుకున్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు పల్లికొండ గోపీనాథ్ మాట్లాడుతూ నేటి యువకులు స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా నడవాలని, ఆయన స్ఫూర్తిని ప్రపంచానికి చాటెలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సిరికొండ: స్వామి వివేకానంద జయంతి, ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి, జాతీయ యువజన దినోత్సవాలను మండలకేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. స్వామి వివేకానంద,అలిశెట్టి ప్రభాకర్ చిత్ర పటాలకు ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ

ఆధ్యాత్మిక, తత్వ బోధనలతో ప్రపంచానికి భారతదేశ విశిష్టతను, యువతలో నిరంతర స్ఫూర్తిని రగిలించిన మహనీయుడు స్వామి వివేకానందఅని అన్నారు. ప్రజల బ్రతుకులెప్పుడు పాలకుల నిజాయితీ పైనే ఆధారపడి వుంటాయని భావించి పెన్నులతో బొమ్మలేసినా, కవిత్వం రాసినా ప్రజాపక్షంగా, పాలకులను ప్రశ్నిస్తూ, అన్యాయాలను ఎదిరించి చెప్పడం రాజకీయ వ్యంగ్యంలో రాటుదేలిన కలం వీరుడు అలిశెట్టి ప్రభాకర్ అని అన్నారు. మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలని, దేశ పురోగతికి, యువశక్తియే ప్రధానమని యువత సామాజిక అవగాహనతో నిరంతరం విజ్ఞానాన్ని, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు.

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలోగల జ్ఞానోదయ హై స్కూల్ లో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ దేవ శంకర్ మాట్లాడుతూ వివేకానందుని సూక్తులు ఆచరణలో పెట్టుకుంటే యువత ఉన్నత స్థానంలో ఉండడానికి అవకాశం ఉందన్నారు. పిరికితనం మనిషిని నిర్వీర్యుడ్ని చేస్తుందని, ఆత్మవిశ్వాసం మనిషిని విజయపథం వైపు నడిపిస్తుందని తెలిపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సైకాలజిస్ట్ శ్రీహరి మాట్లాడుతూ గుడిసె వాసుల నుండే జాతి జాగృతమవుతుందని స్వామి వివేకానంద చెప్పిన జీవిత సత్యాలు నేటికి యువతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు దేశభక్తి గేయాలతో నృత్యాలతో, వివేకానంద వేషాధారణతో అలరించారు, శారీరక మానసిక దృఢత్వానికి ట్రైక్వాండో ఉపయోగపడుతుందని విద్యార్థులతో ప్రదర్శింపజేశారు. కార్యక్రమంలో మంచిప్ప గ్రామ సర్పంచ్ సిద్ధార్థ ,అమ్రాబాద్ మాజీ సర్పంచ్ ఈశ్వర్ సింగ్ నాయక్, మంచిప్ప వీడీసీ అధ్యక్షులు గోవురు నరేష్ రెడ్డి, జై భారత్ యూత్ అధ్యక్షులు సాయిరాం, యువజన నాయకులు, మంచిప్ప అమ్రాబాద్ , కల్పోల్ , రమేశ్వర్ గ్రామ యువకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిప్ప గ్రామంలో యువజన సంఘం సభ్యులు స్వామి వివేకానందుని విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం స్కూల్లో వివేకానందుని క్యాప్సిల్స్ అనే పుస్తకాన్ని విద్యార్థినీ విద్యార్థులకు అందించారు.

కమ్మర్ పల్లిలో రక్తదాన శిబిరం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా గ్రామ యువకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన

45 మంది యువకులు రక్తదానం చేశారు. నిజామాబాద్ జిల్లా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. రక్తదానం ప్రాణదానం తో సమానం అని అన్నారు. రక్తదానం చేసిన యువకులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, ఉపసర్పంచ్ చిన్న గంగారం, ప్రధానోపాధ్యాయులు సాయన్న, గ్రామ యువకులు పాల్గొన్నారు.

రక్తదానం మహా గొప్పది: రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్

డిచ్‌పల్లి: ఇందల్ వాయి మండలంలోని ఎల్లరెడ్డిపల్లి గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రక్త దాన శిబిరాన్ని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. యువకులు భారీ ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఆంజనేయులు, సామాజిక కార్యకర్త పులి సాగర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆ సమయంలో ఒక రక్తం చుక్క కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటదని, అన్ని దానాల కంటే రక్తదానం మహా గొప్పదని వారన్నారు యువకులు స్వామి వివేకానంద చూపిన మార్గంలో నడవాలని వారు అన్నారు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన యువకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జీ నరేష్, ఎంపిటిసి బాబురావు,ఉప సర్పంచ్ జి శ్రీనివాస్,యువజన సంఘాల సభ్యులు, శ్రావణ్, లక్ష్మణ్ ,రఘు తో పాటు యువకులు తదితరులు పాల్గొన్నారు.


సిరికొండ: వివేకానంద, అలిశెట్టి ప్రభాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


మోపాల్‌లో,..


డిచ్‌పల్లి: రక్త దానం చేసిన యువకుడిని అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ

ట్రస్మా అర్బన్ అధ్యక్షుడిగా ధర్మరాజు ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ట్రస్మా కార్యవర్గం

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక ఒక హెూటల్ హాలులో జరిగిన ట్రస్మా అర్బన్ సర్వసభ్య సమావేశంలో సంఘం అర్బన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. అంతకు ముందు అధ్యక్షులుగా ఉన్న పి. నర్సింహరావు, కార్యదర్శి కిరణ్ కుమార్ హయాంలో జరిగిన కార్యక్రమ వివరాలను తెలుపగా, కోశాధికారి నాగరాజు ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ లెక్కలు తెలిపారు. తర్వాత రాష్ట్ర సంఘ బలోపేతానికి కృషి చేసి రాష్ట్ర ట్రస్మా స్పోక్స్ పర్సన్ గా ఎన్నికైన జయసింహ గౌడ్‌ని సభ్యులు ఘనంగా సన్మానించారు. తదుపరి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సలహాదారుగా ఉన్న మామిడాల మోహన్ వ్యవహరించారు. పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు జయసింహ గౌడ్, కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి నిత్యానంద విచ్చేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి కే. ధర్మరాజు, అనుముల క్రాంతి పోటిపడగా ధర్మరాజు ఆధిక్యతను పొంది అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కే. శ్రీనివాస్, కోశాధికారిగా నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని అతి త్వరలో ఏర్పాటు చేస్తామని జిల్లా అధ్యక్షుడు జయసింహ ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మామిడాల మోహన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్షత్రియ పాఠశాల విద్యార్థులు



ఎంపికైన క్షత్రియ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని విజయ్ హైస్కూల్ క్రీడామైదానంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మండలంలోని చేపూర్ క్షత్రియ పాఠశాల నుండి ఏడుగురు విద్యార్థులు ప్రభంజనం సృష్టించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహ స్వామి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14 నుండి కొమరం భీమ్ జిల్లా ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత పొందారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు నమ్రత, ప్రీతిక, హరిణి, శ్రీనిధి, లితిక్ష, హరిణి, శృతికకు అభినందనలను తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఇటిలు సాయినాథ్, అనూష, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీంగల్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు

- 60 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణ పట్టణ కేంద్రంలో శుక్రవారం టాస్క్ ఫోర్స్ ఏసిపి రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో సిఐలు అజయ్, అంజయ్య దాడులు నిర్వహించి పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని బాపూజీ నగర్ కాలనీకి చెందిన సలావుద్దీన్ అనే వ్యక్తి వద్ద 60 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకొని వాటిని స్వాధీనం చేసుకొని సలావుద్దీన్ పై కేసు నమోదు చేసినట్లు భీంగల్ ఎస్సై హరిబాబు తెలిపారు.


పట్టుకున్న బియ్యం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | జనవరి 13, 2024 | www.navatelangana.com

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం..

- డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రమేష్
- రెండు క్లినిక్‌లు సీజ్

నవతెలంగాణ-ఆర్మూర్



క్లినిక్‌ను సీజ్‌చేస్తున్న అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం. సుదర్శనం ఆధ్వర్యంలో పట్టణంలోని నక్షత ఈఎన్టీ క్లినిక్, నవనాథ్ ఈఎన్టి క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా నడుపుతున్న ఆసుపత్రులను క్షుణ్ణంగా తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వైద్యులు వెంకటేష్ గంగాధర్, రామ, తదితరులు పాల్గొన్నారు.

పూలే దంపతుల చరిత్రను భావితరాలకు అందించాలి

- పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాల్సిందే
- బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచే వరకు పోరాటం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్
- సావిత్రిబాయి పూలే అవార్డులు ప్రదానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తమ కోసం కాకుండా జీవించి ఉన్నంతకాలం పేద బడుగు బలహీన వర్గాల బతుకుల బాగుకోసం అనగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం అవిశ్రాంతంగా పనిచేసి చరిత్రలో నిలిచిన మహనీయులకు భూగోళం ఉన్నంతవరకు వారికి మరణం లేదని చరిత్రలో శాశ్వతంగా వారి పేరు నిలుస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాతుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ పట్టణంలోని న్యూ అంబేద్కర్ ఆడిటోరియంలో బీసీ ఉపాధ్యాయ సంఘం ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే 193వ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా జాజుల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావ్, విశిష్ట అతిథులుగా స్థానిక శాసనసభ్యులు సూర్యనారాయణ గుప్త, నగర మేయర్ దండు నీతు కిరణ్, మాజీ శాసనమండలి సభ్యురాలు ఆకుల లలిత, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సామాజిక సేవ చేసిన 70 మంది మహిళలకు సావిత్రిబాయి పూలే పేరిట అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో అణగారిన వర్గాలకు, పేద, బడుగు, బలహీన వర్గాలకు అక్షరాలను దిద్దించి సామాజిక అణచివేత, సామాజిక దోపిడీ లింగ వివక్షతపై జీవితాంతం పోరాడిన మహాత్మ జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలేలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి జీవిత చరిత్రను ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బడుగుల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం అనేక త్యాగాలు చేసి నిలబడిన మహాత్మ జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే దంపతులకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు నిచ్చి గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు అలాగే వారి పేరుతో జాతీయస్థాయిలో చరిత్రలో నిలిచిపోయే విధంగా క్రీడా మైదానాలకు, ప్రాజెక్టులకు, పార్కులకు అంతర్జాతీయ విమానాశ్రయాలకు, పేరు పెట్టాలని, వారి జీవిత చరిత్రను ఉపవాచక రూపంలో తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ఎస్సీ ఎస్టీ అగ్రకులాలకు జనాభా దామాష్ ప్రకారం రిజర్వేషన్లు కొనసాగినట్టుగానే బీసీలకు కూడా బీసీ రిజర్వేషన్లను 27శాతం నుంచి 50శాతం పెంచాలని బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించి బీసీలపై విధించిన క్రిమిలేయరును తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం గుర్తింపు నివ్వాలని ఆయన కోరారు. బీసీలంతా ఐక్యమత్యంతో ఉండి హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు ఎ మోహన్, గౌరవ అధ్యక్షులు కొట్టూరు రమేష్, బిసిటియు నాయకులు ఎస్ విజయలక్ష్మి కళ్యాణి, ప్రతిభ, రమణస్వామి, విజయ్ కుమార్, రామకృష్ణ, రమేష్, సంజీవ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్



అవార్డులు అందుకున్న సామాజిక సేవకులు


67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పరిశీలకులుగా జిల్లా ఫిజికల్ డైరెక్టర్ పి.నీరజరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఈనెల 12 నుండి 14 వరకు సిద్దిపేట జిల్లా సాంఘిక సంక్షేమ పాఠశాల కొండపాక క్రీడామైదానంలో జరుగుతున్న 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్ 19 సాఫ్ట్ బాల్ టవర్నమెంట్‌కు రాష్ట్ర పరిశీలకులుగా పి.నీరజరెడ్డి ఫిజికల్ డైరెక్టర్ (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ధర్మారం) వ్యవహరిస్తున్నట్లు జిల్లా (అండర్-19) స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.గంగాధర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పి.నీరజరెడ్డిని సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల స్పోర్ట్స్ ఆఫీసర్ రామ లక్ష్మయ్య ప్రాంతీయ అధికారిని అలివేలు మంగ, ధర్మారం కళాశాల ప్రిన్సిపల్ సంగీత, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు యం. గంగాధర్, కె.సంగీతరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు టి.విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్‌గౌడ్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి సోప్పరి వినోద్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు


కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు వేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని మైలారం ఎంపీటీసీ గాండ్ల సతీష్ పటేల్, పాక్స్ డైరెక్టర్ శ్రీమంతుల రాజు శుక్రవారం హైదరాబాద్‌లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాకారం రవి, డిసిసి కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, ఎర్రన్న, డీలర్ రమేష్, గంగారెడ్డి, దాసు, సిరికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు

1250 గ్రాముల గంజాయి పదివేల నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న నగర సీఐ నరహరి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఖలీల్ వాడికి చెందిన సయ్యద్ సాజిద్ అలీ అనే వ్యక్తి వద్ద 1250 గ్రాముల గంజాయి, పదివేల రూపాయల నగదు స్వాధీన పరుచుకొని జైలుకు పంపించినట్లు నిజామాబాద్ నగర సిఐ నరహరి శుక్రవారం తెలిపారు. గురువారం సాయంత్రం సాయంత్రం చంద్రశేఖర్ కాలనీ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్నారని నమ్మకమైన సమాచారం మేరకు పట్టణ సీఐ నరహరి, మూడవ పట్టణ ఎస్ఐ ప్రవీణ్ , సిబ్బంది అఫ్సర్ షౌకత్ అలీ గంగ కుమార్ లీలా కృష్ణ ఆ ప్రదేశానికి వెళ్లి నిందితుడిని అదుపులో తీసుకున్నారు. వారినుండి 1250 గ్రాముల గంజాయిని స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసుకుని శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అనిస్ వద్ద కొనుగోలు చేసి నిజామాబాద్‌లోని యువతకు, కొంతమంది వ్యక్తులకు 200 ఒక ప్యాకెట్ చొప్పున అమ్మి జల్సా లకు పాల్పడుతున్నటువంటి సయ్యద్ సాజిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనవద్దగల 1250 గ్రాముల గంజాయిని, 10 వేల రూపాయల నగదు, ద్విచక్ర వాహనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి సోమ వంశీయ క్షత్రియ సమాజ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ న్యాయవాది కాందేశ్ సంగీత శ్రీనివాస్, గుజరాతి ప్రకాష్, నందకిషోర్, గంగా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ సంఘాలకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం బాల్కొండ నియోజకవర్గంలోని పలు మండలాల మహిళా సంఘాల సభ్యులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, మెండోరా, ముప్కల్ మండలాలకు చెందిన 20 మహిళ సంఘాలకు సుమారు రూ.20 లక్షల విలువైన ఆధునిక వ్యవసాయ యంత్రాలైన రోటవేటర్, సీడ్ డ్రిల్, తైవాన్ పంపులు సబ్సిడీ ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భీంగల్ ఏడిఏ కంభంపాటి మల్లయ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని,నూతన వ్యవసాయ యాంత్రీకరణ వినియోగించు కోవలన్నారు.ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ సుజాత, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఐసీఐసీఐ ఫౌండేషన్ డివో అఖిల, రాజేష్, సీఎఫ్ చింత శ్రీనివాస్, సాయి, మధు, రాజేష్, మహేందర్, హరీష్, సనుత్న, మౌనిక, మహిళ సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

తిర్మన్‌పల్లి హత్య కేసును 4 రోజుల్లోనే ఛేదించిన పోలీసులు

- హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం
- డిచ్‌పల్లి సిఐ కె. కృష్ణ వెల్లడి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నాలుగు రోజుల క్రితం హత్య కు గురైన కేసులో 4రోజుల్లోనే పోలీసులు నిందితునికి పట్టుకుని రిమాండ్ కు తరలించారు. శుక్రవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలను సిఐ కె.కృష్ణ వెల్లడించారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు నరేష్‌కు రాజేష్ భార్య ఇద్దరికి వివాహేతర సంబంధం రాజేష్‌కు తెలియడంతో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. అప్పటి నుండి రాజేష్ తన బార్య తనకు ఎక్కడ దూరం అవుతుందోనని భయపడి నరేష్ చంపితేనే తమ మధ్య గొడవలు ఉండవని అనుకున్నాడు. పక్కప్లాన్ ప్రకారం గత నెల 30 న ఉదయం మద్యం తాగుదామని చెప్పి రాజేష్ నరేష్‌ని తిర్మన్‌పల్లి గ్రామ శివారు లోకి తీసుకెళ్లాడు. నరేష్‌కు మద్యం తాగించి మత్తు ఎక్కిన తర్వాత రాజేష్ తన భార్యతోగల వివాహేతర సంబంధం విషయంలో నరేష్‌తో గొడవ పడి చంపుతానని బెదిరించాడు. నరేష్ అక్కడి నుండి పారి పోవడానికి ప్రయత్నించాడు. అక్కడ గుంత ఉండటంతో జారి పడటంతో రాజేష్ కింద పడ్డాడు. నరేష్‌పైన రాజేష్ కాలు వేసి తొక్కి పక్కనే గల పెద్ద రాయిని తీసి రెండు సార్లు నరేష్‌ను బాది చంపినట్లు వివరించారు. తర్వాత రెండు రోజులకు నరేష్‌ని కొట్టి చంపిన రాయి శవం పైనే ఉండగా ఆరాయి పోలీసులకు దొరికితే వేలిముద్రలు దొరుకుతాయని అనుకోని రాజేష్ ఘటన స్థలానికి వచ్చాడు. కొట్టి చంపిన బండ రాయిని శవం పైనుండి తీసి పక్కనే ఉన్న పొదల్లో ఎవరికీ కనిపించకుండా దాచిపెట్టినట్లు సిఐ వివరించారు. గతనెల 30 ఇందల్ వాయి మండలంలోని వెంగల్ పాడ్ తండాకు చెందిన నరేష్ ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని మృతుడి తల్లి నీల ఫిర్యాదు మేరకు ఇందల్ వాయి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 8న మృతుడి బంధవులు నరేష్ కోసం వెతుకుతుండగా మృతదేహం మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామ శివారులోని రైల్వే ట్రాక్‌కు కొద్ది దూరంలో పడి ఉంది. డిచ్‌పల్లి సిఐ ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించారు. మండలంలోని కొత్త కోరుట్ల తండా కు చెందిన కేతవాత్ రాజేష్, నరేష్ (30) తిర్మన్ పల్లి గ్రామంలోని కల్లు బట్టి వద్ద కల్లు తాగి వెళ్లారని తెలిసిందన్నారు. రాజేష్ ను వెతుకుతుండగా హత్య జరిగిన తర్వాత ఎవరికీ కనిపించకుండా తిరుగుతుండగా గురువారం ఇందల్ వాయి ఎస్సై ఎస్ మహేష్, సిబ్బంది తిర్మన్‌పల్లి బస్టాండ్ వద్ద రాజేష్‌ను పట్టుకొని విచారించారు. తాను చేసిన నేరం అంగీకరించి రాజేష్ తన బార్యతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనకు దొరకడంవల్లే నరేష్ ని పథకం ప్రకారమే బండ రాయితో కొట్టి చంపానని అంగీకరించి నట్లు పేర్కొన్నారు. నిందుతుని వద్ద నుండి ఒక సెల్ ఫోన్, బండరాయి నుండి స్వాధీనం చేసుకున్నారు. కేసును చేదించడానికి నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కమ్లేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ఏసిపి ఎం.కిరణ్ కుమార్ ఆద్వర్యంలో చాకచక్యంగా, చేదించిన సిఐ కె.కృష్ణ, ఎస్సై ఎస్ మహేష్, రాజేశ్వర్ హెచ్‌సి, ప్రసాద్ హెచ్ సి, సర్దార్, సతీష్, కిశోర్, రామును అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

కైట్ విక్రయ షాపులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

చైనీస్ మాంజా అమ్మితే కఠిన చర్యలు

ఎస్ఐ రాజశేఖర్


కైట్ విక్రయ షాపులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పతంగులను విక్రయించే షాపుల యజమానులు చైనీస్ మాంజా అమ్మితే కఠిన చర్యలు తప్పవని కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు కిరాణా షాపులను, పతంగులను విక్రయించే దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. చైనీస్ మాంజా వల్ల కలిగే ప్రమాదాలపై షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు చైనీస్ మాంజాను ఉపయోగించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైనీస్ మాంజలు ఉపయోగించడం వల్ల జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన కూడా ఉన్నాయని తెలిపారు. షాపుల్లో చైనీస్ మాంజలను నమ్మితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి


నివాళి అర్పిస్తున్న సర్పంచ్, యూత్‌సభ్యులు

నవతెలంగాణ-నవీపేట్

స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని మండలంలోని యంచ గ్రామంలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో స్వామి)సర్వేశ్వరానంద ఉదాసీన చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేసి స్వీట్లు, పులిహోర, పండ్లు పంపిణీ చేసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన మహనీయుడు వివేకానంద స్వామి అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్ కుమార్, సాయిలు, రావుజి దేవేందర్, లాలు యాదవ్, కమిటీ సభ్యులు యోగేశ్వర్, భూమ్రాజ్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురిపై కేసు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురు పై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గత ప్రభుత్వ మంజూరు పనులను ఆపొద్దు

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రభుత్వం మంజూరు చేసిన పనులను ఆపొద్దని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని నాగేంద్ర నగర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, తడపాకల్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్ లను శుక్రవారం ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ప్రజలకోసం మంజూరైన వివిధ పనులను ప్రస్తుత ప్రభుత్వం ఆపొద్దని సీఎం రేవంత్ రెడ్డికి, ఆయా శాఖ మంత్రులకు, నాయకులకు విన్నవించుకుంటున్నానని తెలిపారు. ఆ పనులన్నీ నాకోసం కాదని ప్రజల కోసం అని అన్నారు. మంజూరైన పనులను రద్దుచేయవద్దని స్థానిక నాయకులు అది నాయకత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. గృహలక్ష్మి కింద పేద ప్రజలకోసం మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను రద్దుచేయవద్దని, ఒక వేళ రద్దు చేస్తే మీ ప్రభుత్వంలో మొదటి ప్రాధాన్యత ఇప్పుడు మంజూరైన వారికే ఇంటి ఆర్థిక సహాయం కోసం 5 లక్షల రుణం ఇవ్వాలని కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూడు నాలుగు గ్రామాలకు ఒక ఆసుపత్రి ఉండాలనే ఉద్దేశ్యంతో బాల్కొండ నియోజకవర్గం మొత్తంగా పేద ప్రజల వైద్యం కోసం 17 హెల్త్ సబ్ సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, సర్పంచ్లు పత్తిరెడ్డి ప్రకాష్, మంజుల బాలాజీ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నాగేంద్రనగర్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల